Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 329 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily) శుక్రవారం, 9 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## ముగిసిన అఖిలపక్ష సమావేశం.. ప్రధాని మోదీ కీలక సందేశం




**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ అఖిలపక్ష సమా వేశంలో ఆపరేషన్ సిందూర్‌పై కీలక సందేశం ఇచ్చినట్లు తెలు స్తోంది. పాకిస్తాన్‌తో పోరులో ప్రతిపక్షాలు తమతో కలిసి నడవా లని ఆయన విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. గురువారం జరిగిన సమావేశం సందర్భంగా ప్రతిపక్ష పార్టీలు ఆపరేషన్ సిందూర్‌పై ప్రశంసలు కురిపించాయి. భారత సైన్యం పాకిస్తాన్‌లోకి చొచ్చుకెళ్లి మరీ ఉగ్రవాదుల స్థావరాలను కూల్చడంపై హర్షం వ్యక్తం చేశాయి.

**100 మంది టెర్రరిస్టుల హతం**

ఆపరేషన్ సిందూర్ గురించి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక విషయాలు వెల్లడించారు. నిన్న పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాదుల స్థావరాలపై జరిగిన దాడుల్లో .. 100 మంది దాకా ఉగ్రవాదులు చనిపోయినట్లు తెలిపారు. ఏప్రిల్ 22 పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా ఈ దాడులు జరిగినట్లు పేర్కొన్నారు. కాగా.. మంగళవారం అర్ధరాత్రి 1.05 గంటలకు ఆపరేషన్ మొదలైంది. మొత్తం 9 ఉగ్రవాదుల స్థావరాలపై మిస్సైళ్ల వర్షం కురిసింది. 25 నిమిషాల్లో ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది.

**సమావేశంలో పాల్గొన్న వారు వీరే..**


రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హోం శాఖ మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్, మంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. ఇక, కాంగ్రెస్ పార్టీ నుంచి రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే వచ్చారు. త్రిణముల్ కాంగ్రెస్ నుంచి సందీప్ బందోపాధ్యాయ.. డీఎంకే నుంచి టీఆర్ బాలు.. సమాజ్ వాదీ పార్టీ నుంచి రామ్ గోపాల్ యాదవ్.. ఆప్ నుంచి సంజయ్ సింగ్.. శివసేన నుంచి (యూబీటీ) సంజయ్ రౌత్ తదితర పార్టీల వారు హాజరయ్యారు.

## మంత్రి లోకేష్ కృషితో ఏపీకి మరో భారీ పెట్టుబడి



**తిరుపతి, (రాజధాని వార్తలు):** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ ఇవాళ (గురువారం) పర్యటించారు. యువగళం పాద యాత్రలో భాగంగా నారా లోకేష్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రప్పించే పనిలో లోకేష్ బిజీగా ఉన్నారు. లోకేష్ అవిశ్రాంత కృషితో రాష్ట్రానికి మరో మెగా పెట్టుబడి వచ్చింది. సత్యవేడు నియోజక వర్గం శ్రీ సిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఏర్పాటుకు ఈరోజు (మే8)న భూమి పూజ చేశారు. రూ. 839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి భూమి పూజ చేయడంతో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకునే దిశగా రాష్ట్రంలో మరో అడుగు పడింది. రూ. 5,001 కోట్ల పెట్టుబడిలో భాగంగా 2 వేల ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మీడియాతో మాట్లాడారు. ఏపీ ఆర్థిక చరిత్రలో ఎల్జీ సంస్థ ఏర్పాటు చరిత్రలలో నిలిచిపోయే అంశమని తెలిపారు. ఎల్జీ తమ సంస్థలు ఏర్పాటు చేయడంతో ఇక్కడ ఎల్జీ సిటీ ఏర్పడనుందని అన్నారు. విదేశీ సంస్థల ప్రతినిధుల రాకపోకలకు రాబోయే నాలుగు సంవత్సరాల్లో తిరుపతికి అంతర్జాతీయ విమానయానం పెరిగేలా చేస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకు రావటానికి మంత్రులు, కలెక్టర్లు మాత్రమే కాదని..ప్రతి నియోజక వర్గం మరో నియోజక వర్గంతో పోటీ పడాలని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ఎల్జీ సంస్థ రూ. 5000 కోట్లతో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు పెట్టే నమ్మకాన్ని తెచ్చిందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కాగా.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటిస్తున్న నేపథ్యంలో ముందస్తు అనుమతితో ఇవాళ కేబినెట్‌కు రావడం లేదని సమాచారం ఇచ్చారు. రేపు (శుక్రవారం) సత్య సాయి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఇవాళ కేబినెట్ సమావేశానికి మరో మంత్రి పయ్యావుల కేశవ్ హాజరు కాలేదు. విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా కేబినెట్ భేటీకి మరో మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరుకాలేదు. ఈ మేరకు మంత్రులు ముందస్తు అనుమతి పొందారు.

## ఆ యాక్ట్ అమలైతే ఏపీ పరిస్థితి ఘోరంగా ఉండేది : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



**పల్నాడు జిల్లా, (రాజధాని వార్తలు):** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గత పాలకుల తప్పిదాలు సరిచేస్తూనే, ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తోందని అన్నారు. సీఎం చంద్రబాబు ప్రతి ఆలోచనా.. కష్టం తమకోసమేననే నిజాన్ని ప్రజలు గ్రహించాలని అన్నారు. అమరావతి, పోలవరం పూర్తిచేసి, రాష్ట్రాన్ని దేశంలోనే ఉన్నత స్థానంతో నిలపాలన్నదే చంద్రబాబు జీవితాశయమని చెప్పారు. చిలకలూరిపేటలో ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే పశుగ్రాసం, దాణా పంపిణీని ఇవాళ (గురువారం) ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ల్యాండ్ టైటిల్ యాక్ట్ అమలైతే పరిస్థితి దారుణంగా ఉండేదని అన్నారు. ప్రజలు తమ ఆస్తులు, భూములు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలేవారని చెప్పారు. జగన్ హయాంలో ఏపీకి తీరని నష్టం జరిగిందని ఆరోపించారు. రాత్రికి రాత్రే అద్భుతాలు జరగడం లేదనుకోకుండా, స్వేచ్ఛా, సంతోషంతో జీవిస్తున్నామని ప్రజలు తెలుసుకోవాలని చెప్పారు. ప్రతి హామీ అమలుతో పాటు, రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు.

## హైదరాబాద్‌లో ఓ ఆర్ఓఆర్‌పై ఘోర ప్రమాదం..ఏం జరిగిందంటే..

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు ప్రమాదాలపై ఎంతగా అవగాహన కల్పిస్తున్న ఏదోక ప్రాంతంలో యాక్సిడెంట్లు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులు మృతి చెందుతుండటంతో ఆయా కుటుంబాలు తీవ్ర శోకంలో ఉన్నాయి. తాజాగా రాజేంద్రనగర్‌లో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజేంద్రనగర్ అవుటర్ రింగు రోడ్డుపై టయోటా కారు బీభత్సం సృష్టించింది. హిమాయత్ సాగర్ వద్ద మరో కారు బ్రేక్ డౌన్ అయింది. ఈ కారు టైర్ మారుస్తున్న రికవరీ వ్యాన్ డ్రైవర్‌ను టయోటా కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. రికవరీ వ్యాన్ డ్రైవర్ శివ కేశవ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. టయోటా కారు డ్రైవర్ మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు చెబుతున్నారు. హైదరాబాద్ నుంచి ఔటర్ రింగు రోడ్డు మీదుగా శంషాబాద్ వైపునకు బ్రేక్ డౌన్ అయిన కారు వెళ్తుంది. హిమాయత్ సాగర్ ఎగ్జిట్ 17 వద్దకు రాగానే సడన్‌గా ఆ కారు ఆగిపోయింది. వెంటనే ఔటర్ సిబ్బందికి కారు డ్రైవర్ సమాచారం ఇచ్చారు.

సంఘటన జరిగిన స్థలానికి రికవరీ వ్యాన్ చేరుకుంది. బ్రేక్ డౌన్ అయిన కారు టైరు మారుస్తుండగా మితిమీరిన వేగంతో టయోటా కారు డ్రైవర్ దూసుకొచ్చాడు. అతివేగంతో టయోటా కారు ఉండటంతో అదుపు కాలేదు. దీంతో రోడ్డు పక్కన టైరు మారుస్తున్న రికవరీ వ్యాన్ డ్రైవర్ శివ కేశవను టయోటో కారు ఢీ కొట్టింది. స్పాట్‌లోనే రికవరీ వ్యాన్ డ్రైవర్ శివకేశవ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మూడు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఏపీ రాజధాని అమరావతి.. కేబినెట్ తీర్మానం



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ కేబినెట్ సమావేశం ముగిసింది. ఈరోజు (గురువారం) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌కు ఏపీ కేబినెట్ అభినందనలు తెలియజేసింది. ప్రధాని, భారత సైన్యానికి అండగా ఉండాలని నిర్ణయించింది. అలాగే ఏపీ రాజధాని అమరావతిగా కేబినెట్ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపాలని నిర్ణయించింది. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కేబినెట్ కోరింది. పునర్విభజన చట్టంలో రాజధానిగా అమరావతి అని పెట్టాలని మంత్రి మండలి కోరింది. దీనివలన అమరావతికి చట్టబద్ధత కల్పించినట్టు అవుతుందని కేబినెట్ పేర్కొంది. క్యాపిటల్ అమరావతిని ఫ్రీ జోన్‌గా చేసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. 2014 పునర్విభజన చట్టంలో రాజధాని అమరాతి అని లేదని.. ఒకసారి పునర్విభజన చట్టంలో రాజధాని అమరావతి అని నిర్ణయిస్తే రాజధానికి చట్టబద్ధత కల్పించినట్లు అవుతుందని పలువురు న్యాయనిపుణులతో పాటు ఇటీవల సీఎం చంద్రబాబును కలిసిన రైతులు కూడా సూచించారు. ఈ క్రమంలో రాజధాని అమరావతిగా నిర్ణయించి కేబినెట్ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించారు. 2014 పునర్విభజన చట్టాన్ని కేంద్రంలో ఉన్న ఉభయసభలు ఆమోదించాయి. అందు వల్ల వాటికి చట్టసవరణ చేయాలి అంటే రాజ్యసభ, లోకసభ చేయాల్సి ఉండటంతో ఏపీ రాజధాని అమరావతి అని పునర్విభజన చట్టంలో సవరణ చేయాలని తీర్మానంలో కేంద్రాన్ని అభ్యర్థించారు. దీనికి సంబంధించి వెంటనే ఢిల్లీలోని ఎంపీలతో మాట్లాడి రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఈ తీర్మానాన్ని ఆమోదించేలా చూడాలని నిర్ణయించారు. అందువల్లే ఈరోజే కేబినెట్‌లో ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. దీనితో పాటు మరో అంశంపై కూడా ఏపీ కేబినెట్‌లో చర్చించారు. ఏపీలో వివిధ సంస్థలకు భూములు కేటాయింపు, రాజధాని అమరావతిలో ఇటీవల కాలంలో సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో భూముల కేటాయింపుపై ఈ సమావేశంలో చర్చించారు. అలాగే గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని మంత్రులకు సీఎం సూచించారు. ఈ ప్రాజెక్ట్ వలన ఎంతో ఉపయోగం ఉందని మంత్రులకు ముఖ్యమంత్రి వివరించారు.

**ఆపరేషన్ సిందూర్‌కు అభినందనలు**

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ఏపీ కేబినెట్ అభినందనలు తెలియజేసింది. సిందూర్ అనే పేరుతో అందరి సెంటిమెంట్‌ను టచ్ చేశారని ఈ సందర్భంగా సీఎం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు పేర్లు పెట్టే సమయంలో అందరికీ దగ్గరయ్యేలా పేర్లు పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

## లిక్కర్ స్కాంలో కొత్త మలుపు.. రంగంలోకి ఈడీ



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎంట్రీ ఇచ్చింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద కేసు నమోదుకు రంగం సిద్ధం చేసింది ఈడీ. పీఎమ్‌ఎల్‌ఏ సెక్షన్ కింద కేసు నమోదుకు తమకు డాక్యుమెంట్లు కావాలని సిట్ అధిపతి, విజయవాడ సీపీకి ఈడీ లేఖ రాసింది. అలాగే కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్, ఇప్పటి వరకు సీజ్ చేసిన బ్యాంక్ అకౌంట్లు వివరాలు పంపాలని ఈడీ కోరింది. రాష్ట్రంలో పెను దుమారం రేపుతోన్న లిక్కర్ స్కాంకు సంబంధించి సిట్ ఇప్పటికే ఎంతో సమాచారాన్ని సేకరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డితో పాటు ఆయన పీఏ పైలా దిలీప్‌ను అరెస్ట్ చేసింది. వారిని కస్టడీలోకి తీసుకుని లిక్కర్ స్కాంకు సంబంధించి కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. అలాగే ఈ కేసులో మరికొన్ని అరెస్ట్‌లు కూడా జరిగాయి. ఈ కేసుకు సంబంధించి పలువురికి నోటీసులు ఇచ్చిన సిట్ అధికారులు వారిని విచారించారు కూడా. లిక్కర్ స్కాం కేసులో నిందితులుగా ఉన్న ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్ప బాలాజీ తమకు మధ్యంతర రక్షణ కల్పించాలని ఏపీ హైకోర్టు, సుప్రీం కోర్టులను కోరినప్పటికీ వారికి నిరాశే ఎదురైంది. ఈ కేసు మొదలైనప్పుడే ఈ ముగ్గురు కూడా సుప్రీంను ఆశ్రయించారు. అయితే ఏపీ హైకోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉన్నందున అక్కడ తేల్చుకుని రావాలని సుప్రీం సూచించింది. అయితే ఈ ముగ్గురు నిందితులకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. దీంతో వెంటనే వారు ఈరోజు సుప్రీంలో పిటిషన్ వేశారు. మధ్యంతర రక్షణ కల్పించాలని కోరారు. అందుకు సుప్రీంకోర్టు కూడా నిరాకరించింది. గతంలో వేసిన పిటిషన్‌ను సవరణ చేయాలని లేదా కొత్త పిటిషన్‌ను వేయాలని సుప్రీం కోర్టు తెలియజేస్తూ విచారణను వాయిదా వేసింది. వీరికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం నిరాకరించడంతో ఈ ముగ్గురి కోసం సిట్ బృందం వేట మొదలుపెట్టింది. విజయవాడ, హైదరాబాద్‌లలో వీరి కోసం తీవ్రంగా గాలిస్తున్నాయి. కానీ ఈ ముగ్గురు తమ సెల్‌ఫోన్లను స్విచ్‌ఆఫ్ పెట్టుకున్నట్లు సిట్ గుర్తించింది.

## మిస్ వరల్డ్ పోటీలు..హైదరాబాద్‌లో భారీ భద్రత



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. ఈ పోటీలు హైదరాబాద్‌లో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో వందకు పైగా దేశాల నుంచి అతిథులు, ప్రపంచ మోడల్స్, పలు పరిశ్రమలకు చెందిన సినీనటులు కూడా భాగ్యనగరానికి రానున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా సైబరాబాద్ జాయింట్ సీపీ గజారావ్ భూపాల్ హైదరాబాద్‌లో అతిథుల భద్రతకు సంబంధించి పలు కీలక విషయాలను వెల్లడించారు. విలేకరులతో ఇవాళ (గురువారం) గజారావ్ భూపాల్ మాట్లాడారు. మిస్ వరల్డ్ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సైబరాబాద్ జాయింట్ సీపీ గజారావ్ భూపాల్ తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఈవెంట్ కొనసాగుతుందని అన్నారు. వివిధ దేశాల నుంచి వచ్చే అతిథులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఇప్పటికే 80 శాతానికి పైగా అతిథులు, పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నారని సైబరాబాద్ జాయింట్ సీపీ గజారావ్ భూపాల్ వెల్లడించారు. వారికి కేటాయించిన హెూటల్స్ వద్ద కూడా భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నామని సైబరాబాద్ జాయింట్ సీపీ గజారావ్ భూపాల్ చెప్పారు. అతిథులు స్టే చేసే పరిసరాలను రెడ్ జోన్, గ్రీన్ జోన్‌గా పెట్టామని చెప్పారు. అనుమతి లేకుండా ఎవరికి లోపలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో చాలా ప్రదేశాలను అతిథులు సందర్శిస్తారని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల కోసం ఎలాంటి ట్రాఫిక్ డైవర్షన్‌లు ఉండవని అన్నారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారిని తీసుకెళ్తామని చెప్పారు. సీఎం, గవర్నర్, మంత్రులు, వీవీఐపీ, వీఐపీలకు ప్రోటోకాల్ ఉంటుందని తెలిపారు. ఇతర జిల్లాల నుంచి కూడా ఫోర్స్‌ను తెప్పించామని అన్నారు. 31వ తేదీన మిస్ వరల్డ్ ఫైనల్ ఉండబోతుందని.. దానికి అనుగుణంగా భద్రత పరమైన చర్యలు తీసుకుంటున్నామని సీపీ గజారావ్ భూపాల్ పేర్కొన్నారు.

# ఆకట్టుకున్న ఆపరేషన్ సిందూర్ మాక్ డ్రిల్

## - అప్రమత్తంగా ఉండాలంటూ సూచనలు





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** భారత్, పాకిస్తాన్ యుద్ధ పరిస్థితుల పట్ల ప్రజలు కనీస జాగ్రతలు చేపట్టాలని సామర్లకోట, పెద్దాపురం మున్సిపల్ కమిషనర్లు శ్రీవిద్య, పద్మావతి, పెద్దా పురం డి ఎస్పీ డి శ్రీహరి రాజులు అన్నారు. బుధవారం సాయంత్రం పెద్దాపురం నియోజక వర్గంలోని సామర్లకోట స్టేషన్ సెంటర్ గడియార స్తంభం వద్ద, పెద్దాపురం పట్టణంలోని మున్సిపల్ సెంటర్లో యుద్ధ పరిస్థితులపై మాక్ డ్రిల్ నిర్వహించారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో ప్రజలకు యుద్ధ పరిస్థితులపై అవగాహన కల్పించారు. ఇండియా, పాకిస్తాన్ మధ్య యుద్ధ పరిస్థితులు ఏర్పడినందున వాయు దాడులు జరిగే అవకాశం ఉందన్నారు. యుద్ధ పరిస్థితులపై అధికార యంత్రాంగం ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తుందని, వెంటనే సురక్షిత ప్రాంతాలకు ప్రజలు చేరుకోవాలని కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. భయం వీడి సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

అనంతరం సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగ రావు యుద్ధ వాతావరణ పరిస్థితిలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశం పాక్ టెర్రరిస్టులపై చేసిన దాడికి మద్దతుగా ప్రజలతో మానవ హారం నిర్వహించి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# శిక్షణ పేరుతో బీసీలకు టెండర్ పెట్టిన కూటమి ప్రభుత్వం

## - టెండర్ల పేరుతో రూ. 245 కోట్ల భారీ స్కాం : జమ్మలమడక నాగమణి




**విజయవాడ, (రాజధాని వార్తలు):** బీసీ పక్షపాతిగా చెప్పుకొనే టిడిపి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణా తరగతులు నిర్వహించి కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని బీసీ ప్రజలకు నమ్మబలికి 245 కోట్ల రూపాయలు భారీ స్కాంకు పాల్పడిందని వైసిపి రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. బీసీలు అంటే బ్యాక్ బోన్ క్యాస్ట్‌గా గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేర్కొని వారికి అన్ని రంగాల్లో సముచితస్థానం కల్పిస్తే నేటి చంద్రబాబు కూటమి ప్రభుత్వం బీసీల నడ్డి విరిచేందుకు ప్రయత్నం చేస్తుందని అన్నారు. దీనికి ఉదాహరణగా బీసీ కార్పొరేషన్ ద్వారా శిక్షణా తరగతులు పంపిణీ చేస్తామని పిలిచిన టెండర్లు అనుభవం లేని కంపెనీలకు కట్టబెట్టడం కంపెనీల నుండి భారీ మొత్తంలో లబ్ధి పొందే విధంగా ఏకపక్ష ధోరణిలో టెండర్లు కట్టబెట్టడం అని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన ఎస్ ఈ డి ఏ పి, ఏపీ ఐ టి సి ఓ, కేంద్ర ప్రభుత్వ సంస్థ ఈయన బి డి యు జీకేవై సంస్థలకు ట్రైనింగ్ సెంటర్లు మానిటరింగ్ సిస్టం ఉన్నప్పటికీ ఆ ప్రభుత్వ సంస్థలను పాల్గొనకుండా రిజెక్ట్ చేయడం విడ్డూరంగా ఉందని ఆమె అన్నారు. జిఓఐ నిబంధనలకు విరుద్ధంగా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా పాన్ ఇండియా కంపెనీతో పాటు మొత్తం 62 కంపెనీలను రిజెక్ట్ చేయడం ప్రభుత్వం యొక్క పక్షపాత ధోరణిని సూచిస్తుందని ఆమె అన్నారు. ఈ స్కామ్‌లో సంతకాలు చేసిన చేస్తున్న ప్రతి అధికారి ఏదో ఒక రోజు ఉద్యోగం పోవడమే కాకుండా జైలుకు వెళ్తారని హెచ్చరించారు. బీసీల పేరు చెప్పి బీసీలను మోసం చేసి 245 కోట్ల రూపాయలు కొట్టేస్తున్న కాంట్రాక్టర్ ఏదో ఒక రోజు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. ఈ స్కాంపై కేంద్ర దర్యాప్తు సంస్థలన్నింటికీ అర్హత ఉండి అనుభవం ఉండి తిరస్కరించబడ్డ కాంట్రాక్టర్లు కంపెనీలు ఫిర్యాదు చేయనున్నారని ఆమె అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ భాగ్యలక్ష్మి , కార్పొరేటర్లు, జిల్లా మహిళా అధ్యక్షురాలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనకుంటే కేంద్రాన్ని మూసేయండి : ఆర్ఎస్కే వద్ద రైతులు నిరసన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఒకవైపు వాతావరణం ఇబ్బందులు పెడుతుంటే మరొకవైపు బ్యాంకు గ్యారంటీలు, టార్గెట్లు లేవంటూ రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయని రైతు సేవా కేంద్రాలు ఎందుకని, సిబ్బంది బయటకు వెళ్తే తాళాలు వేసేస్తామని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామర్లకోట ఎంపీడీవో కార్యాలయం వెనకున్న రైతు సేవా కేంద్రాన్ని భీమవరం ప్రాంతానికి చెందిన పలువురు రైతులు బుధవారం ముట్టడించారు. ధాన్యం ఎందుకు కొనుగోలు చేయడం లేదంటూ సిబ్బందిని నిలదీశారు. బ్యాంకు గ్యారంటీ లేవని, టార్గెట్ లేవని చెబుతున్నారని అటువంటప్పుడు రైతు సేవ కేంద్రంలో మీకు పనేముందని బయటికి రండి అంటూ పిలిచి సిబ్బంది బయటకు రాగా భీమవరం ప్రాంతానికి చెందిన రైతులు రైతు సేవా కేంద్రానికి తాళం వేశారు. అనంతరం పక్కనే ఉన్న మండల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద రైతుల నిరసన వ్యక్తం చేసి ఏవో కార్యాలయం కూడా తాళం పెట్టి సిబ్బంది వెళ్లిపోవాలని వాదనకు దిగారు. కార్యాలయంలో ఉన్న ఏఈఓ రూప విషయాన్ని ఏవో సత్యకు తెలుపగా, ఆమె వచ్చి రైతులకు ధాన్యం కొనుగోలు చేసే విధంగా సివిల్ సప్లై జిల్లా మేనేజర్ తదితర ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. నిరసనలో భీమవరం రైతులు చెక్కపల్లి వీరబాబు, శెట్టిబత్తుల ధర్మరాజు, గూడూరు రాజు, తదితరులు పాల్గొన్నారు.


# స్వయం ఉపాధిగా కుట్టు శిక్షణలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం పనసపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఉచిత కుట్టు శిక్షణను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు)లు ప్రారంభించారు. ఎపిడివో కె హిమ మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసినట్టు చెప్పారు. స్వయం ఉపాధి బాటలో మహిళలు ముందుకెళుతూ ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ ఉచిత కుట్టు శిక్షణలు ఉపయోగించుకోవడంతో పాటు మరింత మందికి ఉపాధిని కల్పించే స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా రిబ్బను కత్తిరించి కుట్టు శిక్షణను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పనసపాడు గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్ జనసేన నాయకులు రాఘవ, లక్ష్మణ్, డైరెక్టర్ పెంకే వెంకటేష్ బాబు, పెద్దాపురం నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుకు కొత్తగా ఏడు సేవలు : మే 7 నుండి ప్రారంభం

## - జీఎస్‌డబ్ల్యూఎస్ ప్లాట్‌ఫామ్ ద్వారా సులభ సేవల అందుబాటు



**కరప, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు మరింత సౌకర్యం కల్పించే దిశగా, గ్రామ వార్డు సచివాలయాల సేవా ప్లాట్‌ఫామ్ జీఎస్‌డబ్ల్యూఎస్ ద్వారా రేషన్ కార్డుల నిర్వహణకు సంబంధించిన ఏడు కొత్త సేవలను మే 7 బుధవారం నుండి ప్రారంభించినట్లు మండల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సేవలు ప్రస్తుత విధానాల ప్రకారం అమలు చేయబడతాయని తెలిపారు. ప్రారంభించిన సేవలు, కొత్త రైస్ కార్డుకు దరఖాస్తు, కార్డుకు కుటుంబ సభ్యులను ఎవరైనా ఉంటే జతపరుచుట, రైస్ కార్డ్ విభజన, కార్డ్ నుండి సభ్యులను తొలగించడం, రైస్ కార్డ్‌ను సరెండర్ చేయడం, కార్డ్‌లో చిరునామా తప్పులను సరిచేయుట, తప్పుగా కలిపిన ఆధార్ వివరాలను సరి చేయుట, ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులన్నీ జీఎస్‌డబ్ల్యూఎస్ సేవా ప్లాట్‌ఫామ్ ద్వారా శాసనబద్ధంగా ప్రాసెస్ చేయబడతాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను తమ ప్రాంత సచివాలయాల ద్వారా సులభంగా పొందవచ్చని తెలిపారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.అనుపమ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు గిరిజనుల మద్దతుతో బ్రిటిష్ ప్రభుత్వంపై అనేక తిరుగుబాటు దాడులు నిర్వహించారన్నారు. ఆయన ధైర్యం, సాహసం, దేశభక్తి ప్రజలను ప్రభావితం చేశాయనీ, అల్లూరి సీతారామరాజు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన పోరాట, దేశభక్తి, త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు, పరిపాలన అధికారి బి.ఎల్.నరసింహం, సీనియర్ నాయకుడు, పెంకే సత్తిబాబు, జనసేన పార్టీ నాయకులు బోగిరెడ్డి గంగాధర్, సీనియర్ అసిస్టెంట్ టి.సుబ్రమణ్యం, జూనియర్ అసిస్టెంట్ రామలక్ష్మి, టైపిస్ట్ కార్తిక్, ఆఫీస్ సబార్డినేట్ వై.వెంకటరమణ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర విజయంపై భారత సైన్యానికి అభినందనలు : పడాల రఘు



**కరప, (రాజధాని వార్తలు):** దేశ భద్రత కోసం నిర్వహించిన "ఆపరేషన్ సిందూర"లో ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడులు చేసి విజయాన్ని సాధించిన భారత సైన్యాన్ని రాష్ట్రీయ హిందూ చైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు హృదయపూర్వకంగా అభినందించారు. కరప మండలంలోని పెనుగుదురులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత ఛాందసవాదాన్ని ప్రోత్సహిస్తూ ఉగ్రవాదాన్ని పెంపొందిస్తున్న దేశాలకు ఇది భారత సైన్యం ఇచ్చిన బలమైన బుద్ధి చెప్పే గుణపాఠమని అన్నారు. ఈ విజయాన్ని "సింహ స్వప్నం"తో పోల్చారు. దేశ సమైక్యతను భంగపరచే స్వార్థ పరులు కళ్ళు తెరువాలని సూచించారు. "హిందూస్తాన్ అంటే హిందువుల దేశం," అంటూ తన భావజాలాన్ని వ్యక్తపరిచిన రఘు, ప్రతి భారతీయుడు ఈ మాతృ భూమిని ప్రతిరోజూ ప్రేమించాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశానికి ఉన్న ఉత్తమ నాయకత్వంలో భారత్ విశ్వగురువుగా అవతరిస్తోందని పేర్కొంటూ, ఈ శుభసమయంలో ప్రతి ఒక్కరూ దేశానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.


# టీటీడీ భూములను ప్రవేట్ వ్యక్తులకు కేటాయింపు లేదు : టీటీడీ తీర్మానం



**తిరుమల/కోవూరు, (రాజధాని వార్తలు):** ప్రపంచ ప్రఖ్యాత గాంచిన ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడేందుకు ఏడుకొండలకు ఆనుకొని ఉన్న భూములను ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించరాదని తిరుమల తిరుపతి ఆలయ పాలక మండలి తీర్మానించింది. టిటిడి చైర్మన్ బీ.ఆర్.నాయుడు ఆధ్వర్యంలో బుధవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో బుధవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో టిటిడి సభ్యురాలు మరియు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. గతంలో తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలోని సర్వే నెం.604లో ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ (ఏపీటీఏ) కు చెందిన 24.68 ఎకరాల భూమిని టీటీడీకి బదలాయించాలని టిటిడి బోర్డు నిర్ణయం తీసుకోగా.. ప్రస్తుతం ఆ స్థలానికి బదులుగా తిరుపతి అర్బన్ సర్వే నెం.588-ఏ లో ఉన్న టీటీడీకి చెందిన 24.68 ఎకరాల స్థలాన్ని ఏపీటీఏ బదలాయింపునకు టిటిడి బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే తిరుపతి రూరల్‌లోని సర్వే నెం.604లోని ఏపీటీఏకు చెందిన మరో 10.32 ఎకరాల స్థలాన్ని టీటీడీకి బదలాయించడం, దానికి బదులుగా తిరుపతి అర్బన్‌లోని సర్వే నెంబర్ 588-ఏలోని టీటీడీకి చెందిన 10.32 ఎకరాల స్థలాన్ని ఏపీటీఏకు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని టిటిడి బోర్డు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. అదేవిధంగా ఇతర ముఖ్యమైన అంశాలపై వారు చర్చించారు. ఈ సమావేశంలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవో శ్రీ వీరబ్రహ్మం తదితరులతో పాటు కోవూరు శాసన సభ్యురాలు, టిటిడి బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో బోర్డు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

# విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సుహాసిని జన్మదిన వేడుకలకు శుభాకాంక్షలు

## తెలిపిన బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్, వనమాల జనార్ధన్ రావు, కటారి సుబ్రహ్మణ్యం



**విడవలూరు/కోవూరు, (రాజధాని వార్తలు):** సమాజ సేవకురాలు, స్వచ్ఛంద సంస్థ, అధినేతరాలు, విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యులు గాలి సుహాసినికి గురువారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్ధన్, టీడీపీ నేత కటారి సుబ్రహ్మణ్యంలు సుహాసినికి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె నిస్వార్థమైన జీవితాన్ని గడుపుతూ అనేక మందికి ఆదర్శంగా నిలిచి సమాజ సేవ చెయ్యడములో ముందంజలో ఉంటున్నదని కొనియాడారు. నిండు నూరేళ్లుతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# ఖమ్మంలో ప్రభుత్వ వైద్య కళాశాలకు శంకుస్థాపన

**ఖమ్మం జిల్లా, (రాజధాని వార్తలు):** నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా వైద్య రంగాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యా వైద్య రంగాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల పక్షాన మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నాగపూర్, అమరావతి నేషనల్ హైవే పక్కన మెడికల్ కాలేజ్ నిర్మాణం జరుగుతుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ..ఖమ్మంలో రూ. 130 కోట్లతో అద్భుతమైన మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైె విద్య, వైద్య ఆరోగ్యశాఖ శాఖలకు




కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం మొండి గోడలతో వదిలి వెయ్యి కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిన అన్నిటినీ క్లియర్ చేస్తున్నామన్నారు. విద్య వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేస్తుందన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం**

ఖమ్మం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం చాలా సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ద్వారా పేదలకు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం దొరల కోసమో పాలకుల కోసమో పని చేసే ప్రభుత్వం కాదని అన్నారు. 9065 సీట్లలో వైద్య విద్యను అందజేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించామని, పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5,950 కోట్లు ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలో రూ. 11,482 కోట్లు ఖర్చు చేసిందన్నారు. వరంగల్‌లో సభ పెట్టి అడ్డగోలు మాటలు మాట్లాడిన వారికి ఈ లెక్కలు తెలియాలని చెబుతున్నానని అన్నారు. 90 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చి వైద్యం అందించామని తెలిపారు. గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన వైద్య రంగాన్ని గాడిన పెడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

**పేద వారికి వైద్యం అందుబాటులో ఉండాలి**

మా అందరికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదర్శమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రూ. 130 కోట్లతో ఖమ్మంలో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఆరోగ్యశాఖ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 16 నెలల పాలనలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. తర్వలోనే ఖమ్మంకు ఆర్గాన్ రిట్రీవర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, వరంగల్‌లో రూ. 39 కోట్లతో రీజినల్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే ఖమ్మంలో వ్యాస్కులర్ యాక్సెస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరిక మేరకు నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తున్నామని దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మిడ్ వైఫరీ కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉంచబోతున్నామని, పేద వారికి వైద్యం అందుబాటులో ఉండాలని మంత్రి దామోదర అభిప్రాయం వ్యక్తం చేశారు.

# సంక్షోభ సమయాల్లో ఏవిధంగా ప్రవర్తించాలో విస్తృత అవగాహన కల్పించాలి : ఆర్డీవో ఎస్ మల్లిబాబు



**కాకినాడ, (రాజధాని వార్తలు):** రసాయన పరిశ్రమల పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ప్రమాదాలు ఇతర సంక్షోభ సమయాల్లో ఏవిధంగా ప్రవర్తించాలో విస్తృత అవగాహన కల్పించాలని కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కాకినాడ రెవిన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో ఆర్డీవో ఎస్ మల్లి, ఫ్యాక్టరీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి కాకినాడ డివిజన్ పరిధిలోని 13 ప్రమాదకర పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రసాయనాలు తయారు చేసే పరిశ్రమలు చుట్టూ నివాసం ఉంటున్న ప్రజలకు అనుకోని సంఘటనలు చోటు చేసుకున్న సందర్భాల్లో, ఇతర సంక్షోభ సమయాల్లో అనుసరించే విధానాలపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సందర్భాల్లో యాజమాన్యాలు అజాగ్రత్త చర్యల వల్లనే పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకుని అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా పరిశ్రమల ప్రతినిధులు తమ పరిశ్రమల చుట్టూ నివాసం ఉంటున్న ప్రజలతో ఎక్కువగా సత్స సంబంధాలు కొనసాగించాలన్నారు. పరిశ్రమల్లో అనుకోని ప్రమాద సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు, సంక్షోభ సమయాల్లో వ్యవహరించాల్సిన విధానాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం దేశ సరిహద్దులో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రధానంగా రసాయనాలు వినియోగించే పరిశ్రమల యాజమాన్యాలు తమ పరిశ్రమల పరిసరాలలో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్డీవో మల్లిబాబు సూచించారు. సమావేశంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఏ.మురళీకృష్ణ, అగ్నిమాపక శాఖ అధికారి యు.సుబ్బారావు, కోరమండల్, ఏఎం గ్రీన్ అమ్మోనియా, రేక్ సిరామిక్, రిలయన్స్, ఓఎన్జీసీ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడుకుంటూ బావిలో పడి బాలుడు మృతి

## - మృతదేహాన్ని వెలికి తీసిన రెస్క్యూ టీం





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణం అయోధ్య రామపురంలో కొంత మంది బాలురు ఆట ఆడుకుంటూ ఉండగా ఏడేళ్ల వయసున్న బాలుడు చావా హేమంత్ ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. అది గమనించిన స్థానికులు పెద్దాపురం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి బాలుడిని బయటకు తీసే ప్రయత్నం చేశారు. అల్యూమినియం నిచ్చెనలను ఉపయోగించి గజ ఈతగాళ్ళను బావిలో దింపి బాలుని వెలికి తీయగా అప్పటికే బాలుడు మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. సాయంత్రం ఏడు గంటల సమయంలో ఈ సంఘటన జరగగా చీకటి పడిన కారణంగా సుమారు రెండు గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది, స్థానిక ప్రజలు శ్రమించి బాలుడు మృతదేహాన్ని వెలికి తీశారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలంతా కలిసి ఆడుకునే సందర్భంలో ప్రమాదవశాత్తు హేమంత్ మృతి చెందడంతో బాలుని కుటుంబం తీవ్ర శోక సంద్రంలో మునిగిపోయారు. ఈ సంఘటన అయోధ్య రామపురం ప్రజలను ఎంతగానో కలచి వేసింది.

# ఘనంగా అల్లూరి 101వ వర్ధంతి కార్యక్రమాలు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి కార్యక్రమాలు సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. సామర్లకోటలో బల్ల మార్కెట్ సెంటర్, బలుసుల పేట అల్లూరి పార్కులోనూ, పెద్దాపురంలో నువ్వుల గుంట వీధి, యాసలపుసూర్యారావు భవనం వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు సిపిఎం, డివైఎఫ్ఐ కమిటీల ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. సామర్లకోటలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు సైపరెడ్డి యువరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు మాట్లాడుతూ అల్లూరి దేశం కోసం రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంపై పోరాడి కేవలం 27 సంవత్సరాల వయసులోనే ప్రాణ త్యాగం చేసారని, గిరిజనులు కోసం జీవితం వెచ్చించారని చెప్పారు. నేటి పాలకులు గిరిజన హక్కులకు భంగం కలిగిస్తూ అటవీ సంపద దోచుకోవటానికి అటవీ మార్గం గుండా 4 లైన్ల రోడ్ వేస్తూ దానిని ఆదానికి



కట్టబెట్టటానికి చూస్తున్నారు. ఈ విషయంలో గిరిజన పోరాటానికి అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కరణం గోవిందరాజు, బాలం శ్రీనివాస్, కరణం ఏడుకొండలు, తుంపాల శ్రీనివాస్, బాలం సత్తిబాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలు

**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** అలయన్స్ క్లబ్ కాకినాడ శరవన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గా ఇండస్ట్రీస్, బాపనదొర కాలనీలో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు అలై. యాళ్ళ రత్నరావు, క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్ అలై. దిలీప్ కుమార్ సధనాని ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం క్లబ్ సభ్యులు వై.మురలీధర్, రవిశంకర్ పట్నాయక్, నిమ్మకాయల వెంకటేశారరావు ఠాగూర్ చిత్రపటంపై పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు అలై. యాళ్ళ రత్నరావు మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్య, విద్యా, దేశభక్తి సేవలు అనంతమైనవని, ఆయన సందేశాలు తరం తరాలకు ప్రేరణని స్తాయనీ అన్నారు. క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్ అలై. దిలీప్ కుమార్ సధనాని మాట్లాడుతూ ఠాగూర్ జ్ఞానం, ఐక్యత ద్వారా మానవతా వికాసాన్ని కలగలిపిన గొప్ప యోచనతో ముందుకెళ్లారన్నారు. మేము అలయన్స్ క్లబ్‌లో ఆయన సిద్ధాంతాలను అనుసరిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఈ కార్యక్రమం




అనంతరం ఠాగూర్ ఆలోచనలు, సమాజంపై ఆయన కలలు అనే అంశాలపై చిన్న చర్చ జరగింది.

# ఆధార్ కేంద్రాలను పరిశీలించిన విడవలూరు ఎంపీడీఓ నగేష్ కుమారి







**విడవలూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు మండలంలోని గాదిల దిన్ని, వరిణి గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగింది అని ఎంపీడీఓ నగేష్ కుమారి అన్నారు. బుధవారం ఈ సందర్భంగా అమె పరిశీలించారు. తప్పని సరిగా ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలని అన్నారు. చేర్పులు మార్పులు ఉన్న యెడల ఈ శిభిరాలు ద్వారా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఈఓ పి ఆర్ డి మస్తానుఖాన్, సిబ్బంది సచివాలయం అధికారులు, స్థానిక నేతలు వరిణి సర్పంచ్ రావేళ్ల మల్లి, కరుణాకర్, తదితరులు ఉన్నారు.

# రామతీర్థంలో ఆరాధన ప్రత్యేక పూజలు

## - అన్నదాన దాత బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనర్దన్‌రావు - బాషా యూత్ చైర్మెన్ వనమాల జనార్దన్





**విడవలూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు మండలం రామతీర్థం పాతూరు గ్రామంలో వెలసి ఉన్న బ్రహంగారి మఠం, కోదండపాణి స్వామికి ఆరాధన ఉత్సవ పూజలు బుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా అన్నదానం దాతగా బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెలన్ వనమాల జనార్దన్ రావు వ్యవహరించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని గ్రామ భక్తులు ప్రత్యేక ఆరాధన పూజలు చేసారు.

ఈ కార్యక్రమంలో పూజారులు, స్థానిక కార్యకర్తలు, కటారి సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కొర్ర కమల్ హాసన్, అధికార ప్రతినిధి బొంకుల దివ్యలత సమక్షంలో విజయవంతంగా క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ కార్యక్రమం

**అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు, (రాజధాని వార్తలు):** పాడేరు జనసేన పార్టీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వ కిట్లు అందజేశారు. ఈ. సమావేశంలో ఐటీ టీమ్ కో ఆర్డినేటర్ సీ. హెచ్. అనిల్ కుమార్ మాట్లాడుతూ, జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన క్రియాశీలక సభ్యత్వ నమోదు సాధారణ కార్యకర్తను గుర్తించడంలో జనసేన ఎప్పుడు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. తన కష్టార్జితం వ్యక్తిగత సంపాదన నుంచి కార్యకర్తల శ్రేయస్సు నిమిత్తం కోట్ల రూపాయలు ఇచ్చిన ఘనత జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్‌కి మాత్రమే సాధ్యమని వివరణ ఇచ్చారు. ఈ మహాయజ్ఞం లాంటి క్రియాశీలక సభ్యత్వ నమోదులో భాగంగా నాకు అవకాశం కల్పించిన డా.వంపూరు గంగులయ్యకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీ తరఫున తలపెట్టిన ప్రతి కార్యక్రమం బాధ్యతగా భావించి పార్టీ బలోపేతానికి పవన్ కళ్యాణ్ ఆశయాలను సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వివరణ ఇచ్చారు. క్రియా సభ్యత్వం ఈ సంవత్సరం



జనసేన అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ స్వయంగా క్రియా వాలంటీర్లకు కిట్లు అందజేయడం ఆనందంగా ఉందని, కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింతగా బలంగా పని చేయడానికి స్ఫూర్తి లభిస్తుందని అన్నారు. నా దగ్గర ఉన్న మిగిలిన కిట్లను ప్రతి క్రియాశీలక కార్యకర్త ఇంటికి వెళ్లి స్వయంగా అందజేస్తానని తెలిపారు.

ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కొర్ర కమల్ హాసన్, మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వం ద్వారా ఎన్నో కుటుంబాలకు భరోసా నిలుస్తున్న పవన్ కళ్యాణ్ గొప్పతనానికి మానవత్వానికి నిదర్శనం అని తెలిపారు.

ఆపదలో, కష్టాల్లో ఉన్న వారికి సాయం చేయడంలో ఆయన దానకర్ణుడు అని తెలిపారు. ఈ క్రియాసభ్య త్వంతో పాటు సభ్యులకు ఇచ్చిన భీమా సౌకర్యంతో ప్రమాదం జరిగినప్పుడు, వైద్యం నిమిత్తం 50,000 రూపాయలు ప్రాణహాని జరిగినప్పుడు వారి కుటుంబ సభ్యులకు రూ 500000 ఇస్తూ పార్టీ తరపున భరోసా కల్పిస్తున్నామని, దేశంలో మరే రాజకీయ పార్టీల్లో లేని సౌకర్యం జనసేన పార్టీ కలగజేసిందని ఆనందం వ్యక్తం చేశారు. అధికార ప్రతినిధి బొంకుల దివ్యలత మాట్లాడుతూ రేపటి తరాల భవిష్యత్తు కాంక్షించి,సమ సమాజ శ్రేయస్సుకు బాటలు వేస్తూ ఒక నిర్దిష్ట లక్ష్యంతో, ఆశయాల బాటలో సిద్ధాం తాల సాయంతో సామాన్యులు సైతం రాజకీయం చేసేలా యువత కలలు సాకారం అయ్యేలా జనసేనాని పూరించిన శంఖం జన సేన పార్టీ అని జనం కోసం మేమున్నాం అనే ధైర్యం నింపుతూ ఎన్నో ప్రజా సమస్యలపై గళమెత్తి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జనసేనాని పవన్ కళ్యాణ్ అడుగుల్లో నడుస్తూ ఆశయాల ప్రయాణాన్ని సాగిస్తున్న తన సైన్యం ఎలాంటి అపత్కాలంలో ఇబ్బందులు పడకూడదని ఎంతో నిబద్ధతతో పార్టీ భావజాల వ్యాప్తికి, పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటూ పార్టీ కొరకు అనుక్షణం శ్రమించే జనసేన పార్టీ కార్యకర్తలను కుటుంబంగా భావించి వారి యోగ క్షేమాలు కాంక్షించి జనసేనాని చేపట్టిన మహా సంకల్పం క్రియాశీలక సభ్యత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అయ్యప్ప పాత్రుడు, పాడేరు మండల నాయకులు ముదిలి సుబ్బారావు, కంఠ సుమన్ ఉల్లి సాయి, క్రియాశీలక సభ్యులు జనసేన శ్రేణులు, వీరమహిళలు తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# 'కవి కుల కిరీటి' రామజోగయ్య శాస్త్రి

### - బిరుదు ప్రదానం చేసిన డా.కంచర్ల - ప్రకటించిన ఎమ్మెల్యే వంశీ
### - శబ్దం ఉన్నంత వరకు ఆత్రేయ ఉంటారు : మాజీ మంత్రి గంటా





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సినీ గేయ రచయిత రామ జోగయ్య శాస్త్రికి కవి కుల కిరీటి బిరుదు పురస్కారం విశాఖలో బుధవారం రాత్రి వరించింది. ఆత్రేయ స్మారక కళాపీఠం గంటి మురళీ ఆధ్వర్యంలో ఈ పురస్కార ప్రదానం జరిగింది. దక్షిణం నియోజక వర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ బిరుదు పురస్కారం ప్రకటన చేశారు. డా.కంచర్ల అచ్యుత రావు పురస్కారం ప్రధానం చేసారు. మాజీ మంత్రి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో గాయకులు ధీరజ్, దుర్గాప్రసాద్, శ్రావ్య, రాజేంద్రప్రసాద్, లహరి, రమేష్ పట్నాయక్, జోగారావు, సత్యశ్రీ, రమ్య తదితరులు ఆత్రేయ రామజోగయ్య శాస్త్రిలు రాసిన గేయాలు పాడేరు. డా.కంచర్ల అచ్యుత రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ రామ జోగయ్య శాస్త్రికి ఆత్రేయ పురస్కారం ఇవ్వడం సముచితం అన్నారు. నా సినిమాలో పాట రాయించుకోవాలని ఉందన్నారు. విశాఖ కళాకారులు పెద్ద సంఖ్యలో ఉన్నారన్నారు. కళ ఉన్నచోట దేవుళ్ళు ఉంటారన్నారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ గంటి మురళీ నిర్వహణలో అంకిత భావం ఉంటుందన్నారు. మనసు కవి మహాకవి ఆత్రేయ పురస్కారం రామజోగయ్య శాస్త్రికి ఇవ్వడం ముదావహం అన్నారు. రవీంద్రభారతి వంటి ప్రాంగణం మధురవాడలో ప్రారంభిస్తామన్నారు. దక్షిణం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ 2011 లో నేను తీసిన సోలో సినిమాకు పాటలు రాసారన్నారు.




నా ఐదు సినిమాల్లో రాసి కొన్ని పాటలూ పడ్డారన్నారు. గొప్ప కవిగా మరింతగా రాణించాలన్నారు. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ ఆత్రేయ రాసి ప్రేక్షకుల్ని రాయకుండా నిర్మాతల్ని ఏడిపించారని అన్నారు. మా శర్మ మాట్లాడుతూ పదాలను పొదుపుగా వాడి ఆత్రేయ కుదిపారని అన్నారు. కన్నడలో గెలిచి తరువాత తెలుగులో గౌరవం పొందారని అన్నారు. ఎర్రాప్రగడ ప్రసాద్ మాట్లాడుతూ రామజోగయ్య శాస్త్రి సాహితీ వైశిష్ట్యాన్ని వివరించారు. బీజేపీ స్పోక్స్ పర్సన్ సుహాసిని ఆనంద్ మాట్లాడుతూ 400 సినిమాలకు పాటలు రాసిన గొప్ప మనసు కవి అన్నారు. ఎస్ ఎస్ ఎస్ ఎన్ రాజు, అవనాధ భార్గవి, పాకలపాటి సుజాత, డా.కె.తిరుమల ప్రసాద్, ఎర్రాప్రగడ రామకృష్ణ, కొణతాల రాజు తదితరులు కార్యక్రమంలో మాట్లాడారు.

# మైలవరం నియోజకవర్గంలో బుడమేరు పరివాహక ప్రాంతంలో గండ్లు పూడ్చాలని విజ్ఞప్తి

### - జలవనరుల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడుకి విజ్ఞప్తి చేసిన శాసనసభ్యులు కృష్ణప్రసాదు





**ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, (రాజధాని వార్తలు):** బుడమేరు పరివాహక ప్రాంతంలో గత ఏడాది సంభవించిన ఆకస్మిక వరదల వల్ల ఏర్పడిన గండ్లు పూడ్చాలని ఏపీ జలవనరుల శాఖ మంత్రి వర్యులు నిమ్మల రామానాయుడుకి, గౌరవ మైలవరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు గురువారం విజ్ఞప్తి చేశారు. ఏపీ రాజధాని అమరావతిలోని సెక్రటేరియట్లో గౌరవ మంత్రి నిమ్మల రామానాయుడుని శాసనసభ్యులు కృష్ణప్రసాదు గురువారం ప్రత్యేకంగా కలిశారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో అకాల వర్షాల ధాటికి బుడమేరు జలప్రళయంతో విపరీతంగా వరదలు సంభవించి మైలవరం నియోజకవర్గంలో ముఖ్యంగా పులివాగు, కోతులవాగు, ఇతరత్రా వాగులకు, ఎన్నో గ్రామాల్లో చెరువులు, వంకలకు చాలా చోట్ల గండ్లు పడ్డాయన్నారు. రానున్న వ్యవసాయ ఖరీఫ్ సీజన్‌లోపు యుద్ధ ప్రాతిపదికన మరమత్తు పనులు చేపట్టి గండ్లు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికి 168 వర్కులకు గానూ రూ.4680.75 లక్షలు అవసరం అని పేర్కొన్నారు. ఇప్పటికి రాష్ట్రప్రభుత్వం 41 వర్కులకు గానూ 659.77 లక్షల నిధులు మాత్రమే కేటాయించిందన్నారు.

ఇప్పటికీ మంజూరు చేసిన నిధులు కాకుండా 127 వర్కులకు గానూ రూ.4020.98 లక్షల నిధులు మంజూరు చేయాలని మంత్రి వర్యులు నిమ్మల రామానాయుడుని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి రామానాయుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

# వినియోగదారుల బాగుకోసం చింతపల్లిలో అవగాహన చైతన్యం

### - వినియోగదారుల మండల ప్రెసిడెంట్ చిట్టిబాబు



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** వినియోగదారుల హక్కులపై ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో చింతపల్లి వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో పీసా చట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సు మే 10వ తేదీన (శనివారం) ఉదయం 10 గంటల నుండి చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమతా చీఫ్ కోఆర్డినేటర్ త్రిపాఠీ హాజరై పీసా చట్టం (పంజాబ్ ఇంటర్వెన్షన్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్) విషయమై ప్రసంగించనున్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, సేవల నాణ్యత, న్యాయ పరిరక్షణ తదితర అంశాలపై ఆయన స్పష్టతనిచ్చేలా అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి మండలంతో పాటు జి.కె.వీధి మండలాల వినియోగదారుల ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండలి ప్రెసిడెంట్ పి.చిట్టిబాబు, కార్యదర్శి కె.అర్జున్‌రావు అందరికీ విజ్ఞప్తి చేశారు.మీడియా మిత్రులు కూడా ఈ కార్యక్రమానికి హాజరై సహకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.


# మేయర్ పీలా శ్రీనివాసరావుని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా కమిటీ



**విశాఖ, (రాజధాని వార్తలు):** మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) గౌరవ మేయర్ పీలా శ్రీనివాసరావుని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా కమిటీ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జీవీ ఎంసీ ఉపాధ్యాయుల వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లి, పరిష్కరించాలని కోరడం జరిగింది. దీనిపై మేయర్ పీలా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించి, దశలవారీగా ప్రాధాన్యతా క్రమంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకట రమణ, నక్కా శ్రీను బాబు, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణరాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు కోట్నీ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఆరిపాక రాజా రమేష్, బుచ్చియ్యపేట మండల శాఖ అధ్యక్షులు అప్పలనాయుడు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ నూకాంబికా అమ్మవారిని దర్శించుకున్న గంటా స్వరూపా

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ డైరెక్టర్ మరియు జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిన గంటా స్వరూపా ఈరోజు అనకాపల్లి శ్రీశ్రీశ్రీ నూకాంబికా అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బుదిరెడ్డి వెంకట్, వాకాడ మదన్, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan